శరవేగంగా జగనన్న కాలనీలు

- నిర్మాణాలు ప్రారంభించని వారికి థర్డ్ ఆప్షన్
- ఈ నెలాఖరున ప్రారంభోత్సవం


సామర్లకోట జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలలో అతి ముఖ్యమైన పేదలందరికీ ఇళ్లు నియోజకవర్గంలో చురుగ్గా నిర్మాణమవుతున్నాయి. పట్టణ పరిధిలో ఈటీసీ లే అవుట్‌లో 2,444 మందికి స్థలాలు ఇవ్వగా సుమారు 1200 వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొన్నారు. మరో వెయ్యి వివిధ దశల్లో ఉన్నాయి. సామర్లకోట-పెద్దాపురం, కిర్లంపూడి రోడ్డు కూడలిలో ప్రధాన రోడ్డు మార్జిన్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు కావడంతో లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు ప్రారంభించుకున్నారు. సామర్లకోట మున్సిపాలిటీలో జగనన్న కాలనీని ఈ నెలాఖరులో సీఎం జగన్ ప్రారంభిస్తారనే సమాచారం రావడంతో ఆయా శాఖల అధికారులు మిగిలిన పనులు పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల అధికారులు ఇక్కడి పనులపై సమీక్షించి ఈనెల 20వ తేదీ లోగా పెండింగ్ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.

చురుగ్గా విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు

జగనన్న కాలనీ వాసులకు నాణ్యమైన విద్యుత్ అందజేయాలన్న లక్ష్యంతో రూ.2.5 కోట్లతో 50 సెంట్ల విస్తీర్ణంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే మున్సిపాలిటీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా పనులు జరుగుతున్నాయి. హౌసింగ్, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలు సంయుక్తంగా కాలనీలో రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నారు.


చురుగ్గా జరుగుతున్న విద్యుత్తు సబ్ స్టేషన్ పనులు

ఇళ్లను త్వరగా నిర్మించాలి

సొంత ఇళ్లు లేని వారు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి వేగంగా పూర్తి చేసుకోవాలని డీఎల్‌డీఓ, మున్సిపల్, హౌసింగ్ అధికారులు సూచిస్తున్నారు. సీఎం వచ్చే నాటికి ప్రతి స్థలంలో నిర్మాణాలు ఉండాలని, 80 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆర్చి సమీపంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న స్థలాల్లో ఇంటి నిర్మాణాలు ప్రారంభించక పోతే వారికి మరో చోట అవకాశం ఇచ్చి ఆ ప్రదేశంలో ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చే వారికి మార్పులు చేస్తామని అధికారులు సూచనలు చేస్తున్నారు. దాంతో రోడ్డు మార్జిన్‌లో ఉన్న లబ్ధిదారులు థర్డ్ ఆప్షన్‌లో ఇంటి నిర్మాణ పనులు చేసుకొవడానికి ముందుకు వస్తున్నారు.

సొంతింటి కల నెరవేరింది



ఎంతో కాలంగా వీర్రాఘవపురంలో అద్దె ఇంటిలో ఉంటున్నాం. సీఎం జగన్ ఇచ్చిన సెంటు స్థలంలో ఇల్లు నిర్మించుకుని గృహప్రవేశం చేశాం. మా పిల్లలకు అమ్మ ఒడి పథకం కూడా వస్తుంది. ముఖ్యమంత్రి చేసిన మేలు మరువలేం.

– కట్టా పద్మావతి, లబ్ధిదారు, సామర్లకోట.

వంద శాతం ఇళ్ల నిర్మాణానికి యత్నం..



జగనన్న లేవుట్‌లో ప్రతి లబ్ధిదారు ఇల్లు నిర్మించి పూర్తిచేయాలని సూచిస్తున్నాం. ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని వారికి థర్డ్ ఆప్షన్‌లో ఇళ్లు నిర్మిస్తాం.

– ఎస్ఆర్‌కే రాజు, హౌసింగ్ డీఈ, పెద్దాపురం

క్లుప్తంగా

మౌలిక వసతులు పూర్తి చేయండి


సామర్లకోటలో టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల సముదాయంలో మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పిఠాపురం రోడ్డులోని టిడ్కో కాలనీని బుధవారం ఆయన పరిశీలించి చిన్న చిన్న మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు బ్యాంకు రుణాలతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత, టీపీఓ ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో జాతీయ జెండాల అమ్మకాలు


కొత్తపల్లి పోస్టాఫీసులో అమ్మకానికి సిద్ధం ఉన్న జాతీయ జెండాలు

కొత్తపల్లి: స్వాతంత్ర్య దినోత్సవానికి అవసరమైన జాతీయ జెండాలు పోస్టాఫీసుల్లో అమ్మకానికి సిద్ధం ఉన్నాయని పోస్టాఫీస్ ఫీల్డ్ ఆఫీసర్ కామేశ్వరరావు తెలిపారు. స్థానిక పోస్టాఫీసును బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయన మట్లాడుతూ పోస్టాఫీసు ద్వారా ఒక్కొక్క జెండా రూ. 25కే అమ్ముతున్నట్టు తెలిపారు. జెండా కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చన్నారు. ప్రతి పోస్టాఫీసులోనూ జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్టు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

పెద్దాపురం: మున్సిపల్ వర్కర్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ బుధవారం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచుతామని, పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీలు ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్న కార్మికులపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో వర్రే గిరిబాబు, శివకోటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే


జి.మేడపాడులో బీఎల్ఓ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

సామర్లకోట: బీఎల్ఓలు చేస్తున్న ఓటర్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీఓ కె సీతారామారావు అన్నారు. బుధవారం జి.మేడపాడు, పీబీ దేవం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఓటర్లు బీఎల్ఓలకు సహకరించాలన్నారు. ఓటర్ల సర్వేను ఈ నెల 21 నాటికి పూర్తి చేయాలని బీఎల్ఓలను ఆయన ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన అవసరం


డాక్టర్ మహోన్నత్‌ను సత్కరించిన లయన్స్ క్లబ్ సభ్యులు

సామర్లకోట: మధుమేహంపై ప్రతి ఒక్కరిలోను అవగాహన ఉండాలని డాక్టరు మహోన్నత్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలల్లో భాగంగా స్థానిక 11వ సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆహార అలవాట్ల ద్వారా మధుమేహాన్ని అదుపు చేసుకోవచ్చునని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ అధ్యక్షత వహించగా జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, క్లబ్ కార్యదర్శి కెఎస్ఆర్ ప్రసాద్, మాజీ అధ్యక్షులు సింగవరపు సత్యనారాయణ తదితరులు డాక్టరు మహోన్నత్‌ను సత్కరించారు. సాయంత్రం ఉండూరు రోడ్డులోని ఫిల్టర్ బెడ్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 100 మొక్కలు నాట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు పరిధిలోని జి.మేడపాడు గ్రామంలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని హెల్పర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ జి.ఉష ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 19వ తేది వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. 10వ తరగతి అర్హత కలిగి, స్థానికులై, 21 సంవత్సరాలు నిండిన ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పంటలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- ఇరిగేషన్ అధికారులతో సమీక్ష


పిఠాపురంలో నీటిపారుదల శాఖ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ఏలేరు, పీబీసీ పరిధిలో పంటలకు నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. బుధవారం గొల్లప్రోలుకు చెందిన స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, కొమ్ము సత్యనారాయణ, పెదిరెడ్ల వెంకటరాజు, పడాల బాలరాజు, జ్యోతుల శివ తదితరులు ఎమ్మెల్యేను కలిసి పిఠాపురం నియోజకవర్గంలో పంటలకు నీటి ఎద్దడి ఉందని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నీటిపారుదల శాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ రాంగోపాల్, డీఈఈ కాశి సురేష్‌లను హుటాహుటీన పిఠాపురం పిలిపించి వారికి సమస్యను వివరించారు. పిఠాపురం నియోజకవర్గంలో ఏలేరు, పీబీసీ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా వెంటనే సాగు నీరు విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా జరుగుతుండగా 80 శాతం పూర్తయ్యాయని, సాగునీరు అందకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే వెదజల్లు పద్ధతిలో సాగు చేసిన వరి పంటలు బీటలు వారాయని, నీరు సకాలంలో అందకపోతే మరింత నష్టం కలిగే అవకాశం ఉందని ఎస్ఈకి వివరించారు. రైతులు తమ పంటలకు తగిన సమయంలో తడి పెట్టుకునే విధంగా చెరువులను నింపాలని ఆయన అధికారులను కోరారు. ఏలేరు నుంచి 200 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. పంట కాలువలకు నీటి సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నీరు సకాలంలో అందేలా కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పలు ప్రాంతాల్లో పంటలు ముంపు బారిన పడడంతో కాలువకు నీటి విడుదల తగ్గించారన్నారు. పంటలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గత నాలుగేళ్లలో ఎక్కడా పంటలు ఎండిన దాఖలాలు లేవన్నారు. వెదజల్లే పద్ధతిలో వేసిన నాట్లకు నీరు లేకుండా తీసేయడం వల్ల బీటలు వారుతుంటాయని, అయినప్పటికీ పంటలకు నష్టం ఉండదని అధికారులు చెప్పారన్నారు. రైతులు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, అవసరమైతే తానే స్వయంగా పంటలను పరిశీలించి దగ్గరుండి మరీ నీరు అందించే ఏర్పాట్లు చేస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కార్యదర్శుల శిక్షణ పరిశీలకుడు ఏసుబాబు


శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి ఏసుబాబు

సామర్లకోట: సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏఓ ఎం ఏసుబాబు అన్నారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ కార్పొరేషన్, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలలోని సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ శిక్షణకు ప్రతీ అభ్యర్థిపై ప్రభుత్వం రూ.రెండు వేలు ఖర్చు చేస్తోందని, దీనిని దృష్టిలో ఉంచుకొని శిక్షణను బాధ్యతతో నేర్చుకోవాలన్నారు. మధ్యలో వెళ్లిపోయే కార్యదర్శులపై చర్యలు తీసుకునేలా కమిషనర్లకు సమాచారం ఇస్తామని తెలిపారు. ముగింపు రోజున రాత పరీక్ష నిర్వహించి పాస్ అయిన వారికి మాత్రమే సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత సర్టిఫికెట్లు పొందిన వారికి మాత్రమే సచివాలయాల్లో కార్యదర్శులుగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. మున్సిపాలిటీల నోడల్ అధికారులు సీహెచ్ సుజాత, యు.జ్యోతిరామ్, ఎస్‌వీ రామారావు, కె.శ్రీనివాసరావు, కేపీ ప్రసన్న వదనం, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

కుల వివక్షను నిర్మూలిద్దాం


పిఠాపురం అంబేద్కర్ సెంటర్లో నినాదాలు చేస్తున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నేతలు

పిఠాపురం: దేశ స్వాతంత్ర్యం కోసం అమరవీరులు కొనసాగించిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కుల వివక్షతను నిర్మూలించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) నాయకుడు కె.సింహాచలం పిలుపునిచ్చారు. పిఠాపురం అంబేద్కర్ సెంటర్లో బుధవారం కుల వివక్షతకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులు, గిరిజనులపై ఏదో ఒక చోట దాడులు జరుగుతున్నాయన్నారు. క్విట్ కుల వివక్ష, క్విట్ మతోన్మాదం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు కె.శివశంకర్, ఎం.ఫెడరిక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఉబా బుల్లబ్బాయి, ఎం.ఏడుకొండలు, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయంగా పాలన

మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్


సీసీ రోడ్లను ప్రారంభించి మాట్లాడుతున్న వైస్ చైర్మన్ సాయి ప్రసాద్

పెద్దాపురం: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ కౌన్సిల్ పాలన సాగిస్తుందని వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. పట్టణంలోని 10వ వార్డుతో రూ.పది లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, ముమ్మన ప్రకాష్, డీఈ ఆదినారాయణరావు తదితరులున్నారు.

బ్రహ్మానందపురం లేఅవుట్ పరిశీలన


బ్రహ్మానందపురంలో లే అవుట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ తదితరులు

సామర్లకోట: మండల పరిధిలోని అచ్చంపేట శివారు బ్రహ్మానందపురంలో పేదల లే అవుట్‌ను బుధవారం ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఎకరాలు సేకరించి లేఅవుట్‌ను సుందరంగా తీర్చిదిద్దారన్నారు. లే అవుట్‌లో భూమి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసి సర్వే నంబర్లు వేయాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. అలాగే లే అవుట్‌లో ఉన్న తుప్పలను ఉపాధి పథకంలో తొలగించాలని సూచించారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఆర్ఐ బాలాజీ, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నాడ ఐదో వార్డుకు నామినేషన్ దాఖలు


ఎన్నికల రిటర్నింగ్ అధికారి పద్మరూపకు నామినేషన్ అందిస్తున్న రాజుబాబు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ పంచాయతీ 5వ వార్డుకు బుధవారం ఒక నామినేషన్ దాఖలైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పద్మరూప తెలిపారు. గ్రామానికి చెందిన రాజాల రాజుబాబు నామినేషన్ దాఖలు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం సాయంత్రం 5 గంటల వరకూ పంచాయతీలో నామినేషన్లు స్వీకరిస్తామని, 11న నామినేషన్ల స్క్రూటినీ, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 19న పోలింగ్ నిర్వహించి అదేరోజు ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు.

హిరోషిమా-నాగసాకి దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న నోరి బలరామకృష్ణ

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో హిరోషిమా-నాగసాకి సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. 1945 ఆగస్టు నెలలో హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా జరిపిన అణుబాంబు దాడికి సంస్మరణంగా 6 నుంచి 9వ తేదీ వరకు ఈ దినాన్ని నిర్వహిస్తున్నారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రంపై క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించగా జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, కె.శ్రీనివాసు, పి.బ్రహ్మానందం పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

అన్నవరం: ర్యాగింగ్ చట్టవిరుద్ధమని, విద్యాసంస్థల్లో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నవరం ఎస్ఐ కిషోర్ బాబు హెచ్చరించారు. స్థానిక సత్యదేవ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతుందని తెలిపారు. న్యాయవాదులు రాజాల చిట్టిబాబు, బుగత శివ, ఎ. దేవి, ఆకాశపు మల్లేశ్వరరావు, రాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

కిర్లంపూడి: బంగారం చోరీ చేసులో కాకినాడ కుంతీదేవి కాలనీకి చెందిన నిందితుడు పోలినాటి భవానీశంకర్‌ను అరెస్ట్ చేసినట్లు జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకర్లకు వివరాలు వెల్లడించారు. కిర్లంపూడి మండలం పాలెం గ్రామానికి చెందిన అవసరాల వెంకట సుధాకర్ గత నెల 17న తన తండ్రిని వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అదే నెల 19న ఇంటికి రాగా ఇంటి తలుపుల తాళాలు తీసి ఉన్నాయి. వెంటనే ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి చూడగా అందులో దాచిపెట్టుకున్న బంగాలు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. వెంటనే సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా బుధవారం సింహాద్రిపురం గ్రామ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న భవానీశంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అసలు నిజం బయటపెట్టాడు. అతని నుంచి 110 గ్రాముల బంగారం, రూ.25 వేలు నగదును రీకవరీ చేసినట్టు సీఐ సూర్యఅప్పారావు తెలిపారు. సమావేశంలో ఎస్సై బి.ఉమామహేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ వి.విజయకుమార్, కానిస్టేబుల్ శ్రీనివాసు ఉన్నారు.

డంప్‌యార్డుగా పిఠాపురం రోడ్డు


సామర్లకోట-పిఠాపురం రోడ్డులో చెత్తను తీసుకువచ్చి వేస్తున్న ట్రాక్టర్

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డు కంపోస్టు యార్డుగా తయారవుతోంది. ఈ నెలాఖరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాకను పురస్కరించుకుని ఆయా రోడ్డు మార్జిన్‌లో తుప్పలను, చెట్టు కొమ్మలను తొలగించి శుభ్రం చేయడానికి కాంట్రాక్టు ఇచ్చారు. ఆ కాంట్రాక్టరు తొలగించిన చెట్ల కొమ్మలను, చెత్తను పిఠాపురం రోడ్డులోని ఏలేరు కాలువ వెంబడి వేస్తున్నారు. దాంతో ఆ రోడ్డు కంపోస్టు యార్డుగా మారిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కమిషనర్ జె.రామారావును వివరణ కొరగా పిఠాపురం రోడ్డులో ఉన్న చెత్తను తొలగించాలని కాంట్రాక్టరుకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

ఘనంగా 'నా మట్టి-నా దేశం'


ఉండూరు సచివాలయం వద్ద మొక్కలు నాటిన ఎంపీపీ, ఎంపీడీఓలు


వడ్లమూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


అమరవల్లిలో మొక్క నాటుతున్న సర్పంచ్ జయబాబు తదితరులు

సామర్లకోట: 'నా మట్టి-నా దేశం' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలో ఉండూరు, పి.వేవరం పంచాయతీల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా 'నా భూమి-నా దేశం' శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. 'మట్టికి ప్రణామం-వీరులకు వందనం' అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సర్పంచ్‌లు సత్యాడి ధనలక్ష్మి, ఎలిశెట్టి నూకరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు ఎలిశెట్టి నరేష్, భీమన్న దొర, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని నేలకు ప్రణామం-వీరులకు వందనం పేరిట బుధవారం ర్యాలీ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, పంచాయతీ కార్యదర్శి కళ ఆధ్వర్యంలో 'నా భూమి-నా దేశం' నిర్వహించారు. అమర వీరులకు నివాళులర్పిస్తు ప్రతిజ్ఞ నిర్వహించారు. చిన్నారావు, రాజు, గంగాధర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'నా భూమి-నా దేశం'

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అమరవల్లి సర్పంచ్ పులి జయబాబు కోరారు. మండలంలోని అమరవల్లి, కొత్తపల్లి, కొండెవరం గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఉపాధి హామీ ఏపీఓ రాజబాబు ఆధ్వర్యంలో నా భూమి- నా దేశం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. అమరవల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అబ్రహం లింకన్ మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామ పంచాయతీ నుంచి సేకరించిన మట్టిని జిల్లా కేంద్రానికి, అక్కడి నుంచి ఢిల్లీకి తీసుకెళ్తారన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఈఓపీఆర్డీ భాస్కర్ పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


వి.కొత్తూరు పాఠశాలలో గిరిజన సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వనలత ఆధ్వర్యంలో విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. బాలికలు ప్రదర్శించిన గిరిజన సాంప్రదాయ నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు విజయకుమారి, ఆశాజ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులను కాపాడుకుందాం

రౌతులపూడి: ఆదివాసీ హక్కులను కాపాడుకుందామని ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి, ఆదివాసీల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటిమళ్ల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక గుమ్మరేగుల సెంటర్‌లోని అల్లూరి సీతరామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ నంబర్-2 నిర్వీర్యం చేయడం వలన ఆదివాసీలు విద్యా, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారన్నారు. గిరిజనులు ఏకమై హక్కులు, బాధ్యతలను పరిరక్షించుకోవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగులు గంటిమళ్ల అప్పారావు, గంటిమళ్ల నాగేశ్వరరావు, మురిడిండి దేవుడు, తరుణ్ పాల్గొన్నారు.

జగ్గంపేట: ఆదివాసీ గ్రామాల్లో మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు కోరారు. జగ్గంపేట మండలం గోవిందపురంలో బుధవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. పలువురు లిబరేషన్ శ్రేణులు పాల్గొన్నారు.

కొండపోడు భూములకు పట్టాలివ్వాలంటూ ఆందోళన

ఏలేశ్వరం: కొండపోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ పరిమితడక గ్రామంలో బుధవారం గిరిజనులు ఆందోళన చేశారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ అనుబంధ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మర్రివీడులో గత 30 ఏళ్లుగా సుమారు 300 మంది గిరిజనులు కొండపోడు భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. వీరికి ఇప్పటివరకూ పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పట్టాలు ఇవ్వాలని కోరారు.

బడి బయట పిల్లలపై సర్వే చేయండి


జీఆర్ సర్వేపై మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

సామర్లకోట: బడిబయట పిల్లలు లేకుండా సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు సహకరించాలని విద్యాశాఖ ఆర్‌జెడీ నాగమణి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక మెప్మా కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. జీఆర్ సర్వేను 100 శాతం పూర్తి చేయలన్నారు. ఐదు నుంచి 18 సంవత్సరాల పిల్లల కోసం కొత్త ఆప్షన్ క్వశ్చన్ సర్వే ఫారంలో పూర్తి చేయాలన్నారు. ఎంఈఓ 2 పి.పుల్లయ్య సీఆర్పీలు పాల్గొన్నారు.